క్లుప్తంగా

కమ్మ సిగడాం జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ అవతారం

రణస్థలం: త్వరలో జరిగే కమ్మ సిగడాం మహాలక్ష్మీ తల్లి జాతర ఏర్పాట్లను జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం గురువారం పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, దేవరాపల్లి, రా మతీర్థాలు, రణస్థలం నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. పరిశీలనలో జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, సభ్యులు గురాల రఘునాథ్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జి.సిగడాం: మండలంలోని నడిమివలస, జి.సిగడాం గ్రామాల్లో ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి యర్రా శారద గురువారం తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వ, రికార్డుల నిర్వహణ, స్టాక్ వివరాలను పరిశీలించారు. తనిఖీల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమరాపు సుగుణాకరరావు, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాకలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు, ముఖ్య అతిథి సిరిపురపు జగన్నాథరావు చేతుల మీదుగా గురువారం పీ.ఎం.జే.జే.బీ.వై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) చెక్కులు పంపిణీ చేశారు. చిన్నమురపాకకు చెందిన ఇప్పిలి కాంతమ్మ, కేశవరాయునిపాలెంకు చెందిన బోనెల అచ్చియ్య, నాయన పైడితల్లిలకు ఒక్కొక్కరికీ రూ.రెండు లక్షలు చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎం.వెంకటసత్యనారాయణ, అకౌంటెంట్ వి.అశోక్ కుమార్, సీఎస్‌పీ షణ్ముఖకుమార్, పెంటయ్య రెడ్డి, వెలుగు సిబ్బంది కళ్యాణి, నీలవేణి పాల్గొన్నారు.


ఏఐటీయూసీలో చేరిన మున్సిపల్ కార్మికులు



సంఘంలో చేరిన వారికి కండువాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఏ, బీ, సీ డివిజన్లలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో చేరారు. ఇప్పటి వరకు వారు వేరే యూనియన్‌లో ఉండే వారు. స్థానిక నాగావళి రివర్ వ్యూ పార్కులో గురువారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, కళ్యాణి అప్పలరాజు సమక్షంలో ఏఐటీయూసీ సభ్యులుగా చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఎస్.చంద్రరావు, జె.గురుమూర్తి, ఎస్.పార్థసారథి, ఆర్.గణేష్, బొమ్మాళి కూర్మారావు, పాట్నూరు గోపి, కవ్వాడి కృష్ణకుమారి, మాడుగుల గిరి, డి.రమణ, రామచంద్ర, పి.సురేష్, కె.తిరుమలరావు, గౌతం, రాజు తదితరులు పాల్గొన్నారు .

ఉత్సాహంగా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రికెట్ నెట్స్‌లో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 57 మంది హాజరయ్యారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ప్రాబబుల్స్ జాబితాను సిద్ధంచేశామని డీఏసీసీ ఛైర్మన్ ఎడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు సువరపు రామన్ సుబ్బారావు, ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు ఈ ఎంపికలను స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కౌన్సిలర్ డాక్టర్ సువ్వారి రవికుమార్, దివ్యాంగుల క్రికెట్ సంఘం జిల్లా ప్రతినిధులు పీజీ నాయుడు, కె.కిరణ్, జెడ్పీఏ కోచ్ కె.సుదర్శన్, అసిస్టెంట్ కోచ్ అన్నెపు ఆనంద్‌కుమార్, పీడీ అడ్మిన్ అనుపమ రామ్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస సాయం..

ఏడాదికే పరిమితం



పశుగ్రాసం పెంపకం చేపడుతున్న రైతులు

- ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక సహాయం
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పశుసంవర్ధకశాఖ
- నీటి సౌకర్యం ఉన్న రైతులకే అవకాశం
- గతంలో మూడేళ్ల పాటు సహాయం
- ప్రస్తుతం ఏడాదికే పరిమితం చేసిన కూటమి ప్రభుత్వం



పశుగ్రాసం

ఎచ్చెర్ల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకానికి పశు సంవర్ధక శాఖ ఆర్థిక సహాయం అందజేస్తోంది. పాల ఉత్పత్తిని పెంచడం, పశువులకు మేత కొరత లేకుండా చేయడం ఈ పథకం ఉద్దేశం. దీనిలో భాగంగా పాడిపశువులు, సాగునీటి సౌకర్యం ఉన్న రైతులకు బహువార్షిక పశుగ్రాసాలను పెంచడానికి ప్రభుత్వం కొత్త నిబంధనలను ఖరారు చేసింది. గతంలో పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి సాగునీటి సౌకర్యం ఉండి, ఎన్ని ఎకరాల భూమి ఉన్న రైతులైనా ఈ పథకానికి అర్హులే. పశుగ్రాసం పెంపకానికి మూడేళ్లపాటు నిధులు అందించేవారు. ప్రస్తుతం ఈ నిబంధనలను మార్చారు. గతంలో మూడేళ్ల పాటు అందించిన ఆర్థిక సహాయాన్ని ఏడాదికి కుదించగా, 5 ఎకరాల్లోపు భూములున్న ఎస్సీ, ఎస్టీతో పాటు మిగతా సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులని నిబంధన పెట్టారు. అలాగే ఒక్కో రైతు 10 సెంట్లు నుంచి 50 సెంట్ల లోపే సాగు చేయడానికి అవకాశం కల్పించారు. పశుగ్రాస క్షేత్రాల నిర్వహించాలనుకునే రైతులు తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు ఉపాధి హామీ జాబ్‌కార్డు, భూముల వన్‌బీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్‌కార్డు జెరాక్స్‌లు జతచేసి పశువైద్యాధికారులకు కానీ, రైతు సేవా కేంద్రాల్లో కానీ అందజేయాలి. ఈ దరఖాస్తులను పశు సంవర్ధకశాఖ అధికారులు పరిశీలించిన తర్వాత అర్హులను ఎంపికచేస్తారు.

విస్తీర్ణం ఆధారంగా సాయం..

పశుగ్రాసం పెంచే రైతులకు విస్తీర్ణం ఆధారంగా ఆర్థిక సహాయం అందించనున్నారు. ఏడాదికి 50 సెంట్లు సాగుకు వేతనదారుల ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17, 992 మొత్తం రూ.32,992 అందించనున్నారు. 40 సెంట్లు సాగుకు వేతనదారుల ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.14, 394 మొత్తం రూ.26,394 అందించనున్నారు. 30 సెంట్లు సాగుకు వేతనదారుల ఖర్చు రూ.9 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.10, 795 మొత్తం రూ.19,795 అందించనున్నారు. 20 సెంట్ల సాగుకు వేతనదారుల ఖర్చు రూ.6 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.7,197 మొత్తం రూ.13,197 అందించనున్నారు. 10 సెంట్లు సాగుకు వేతనదారుల ఖర్చు రూ.3 వేలు, మెటీరియల్ ఖర్చు రూ. 3,599 మొత్తం రూ.6,599 చొప్పున అందించనున్నారు.

ఏడాది మాత్రమే..



బహువార్షిక పశుగ్రాసం పెంపకానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు తమ సమీపంలోని పశువైద్యశాలలో అధికారులకు గానీ, రైతు సేవా కేంద్రాల్లో గానీ దరఖాస్తులు అందజేయాలి. ఏడాదికి మాత్రమే ఆర్థిక సహాయం అందిస్తాం.

– వి.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

దుకాణం బంద్



రణస్థలం మండల కేంద్రంలో స్థానికులు, వ్యాపారులతో చర్చించకుండా, ఎలాంటి సమావేశం నిర్వహించకుండా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు హైవే అధికారులు శ్రీకారం చుట్టడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రణస్థలం బంద్‌కు పిలుపునివ్వడంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేశారు.

- రణస్థలం

శిథిలమవుతున్న వంతెన



కుప్పిలి నుంచి బుడగుట్ల పాలెం మధ్య గెడ్డపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంటోంది. కాంక్రీట్ ఊడిపోయి ఐరన్ రాడ్లు కనిపిస్తున్నాయి. మరమ్మతులు చేయకపోతే వంతెనపై రంధ్రాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఈ రోడ్డుపై నిరంతరం ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ట్రిప్పర్లు వంటివి రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

వెంకన్నకు జన్మనక్షత్ర పూజలు



పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు బూరాడ వంశీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి అభిషేకాలు, భజన మండలి ఆధ్వర్యంలో తిరువీధి భజనలు జరిగాయి.

- శ్రీకాకుళం కల్చరల్

విశ్వశాంతికి స్ఫూర్తి ప్రదాత బాపు



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో మహాత్మా గాంధీకి నివాళి అర్పిస్తున్న వీసీ రజిని

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచానికి సత్యం, అహింస మార్గాలను అందించి పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలిచిన మహాత్మాగాంధీ చూపిన బాట విశ్వశాంతికి స్ఫూర్తిని అందిస్తోందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోగల శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిర భారత స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం 4వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. తొలుత గాంధీ మందిరం ఆవరణలో 105 అడుగుల ఎత్తులో జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం విశ్వశాంతి కోరుతూ జిల్లాకు చెందిన పోలీసు, సీఆర్‌పీఎఫ్, ఆర్మీలో పనిచేసి అమరవీరులైన వారి అమరవీరుల స్థూపం గాంధీ మందిరంలో నెలకొల్పిన క్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ దంపతులు విశ్వశాంతి హోమం జరిపించారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, కొంచాడ సోమేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్, నటుకుల మోహన్, తమ్మినేని ఉషారాణి, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, మహిబుల్లాఖాన్, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, బుడుమూరు సూర్యారావు, మాజీ సైనికుల సంక్షేమాధికారి ఈశ్వరరావు, బెందాళం వరలక్ష్మి, పద్మావతి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: మహాత్మగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్



శ్రీకాకుళం కల్చరల్: దేశెల్లవీధిలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గ్రామపెద్దలు



శ్రీకాకుళం అర్బన్: ఇందిరావిజ్ఞానభవన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీఐ టి.త్రినేత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ టి.త్రినేత్రి అన్నారు. కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సత్ప్రవర్తన, ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్ నిర్మూలన, మానవ అక్రమ రవాణాతోపాటు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ పాత్రుని లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు, సనపల షణ్ముఖరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాజశ్యామల దేవి వద్ద సామూహిక కుంకుమ పూజలు



మొండేటివీధిలో పూజలందుకుంటున్న రాజశ్యామల దేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో గురువారం నుంచి తొమ్మిరోజుల పాటు నిర్వహించనున్న రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, రాజశ్యామల యంత్ర పూజలు, హోమాలు నిర్వహించారు. అదే విధంగా, మొండేటివీధిలోని లలితా సమేత శివకామేశ్వరీ దేవాలయంలోనూ రాజశ్యామలా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి తమలపాకులతో అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. షిరిడీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



బహుమతి అందుకుంటున్న హేమలత

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థానానికి ఎదిగి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని కేజీబీవీ కళాశాల విద్యార్థిని బెవర హేమలత 973 మార్కులతో జిల్లా స్థాయిలో ఇంటర్మీడియట్‌లో ప్రథమస్థానం, రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించడంతో ఎమ్మెల్యే బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ లలిత గురువారం అభినందించారు.

పేదల సంక్షేమానికి చంద్రబాబు తూట్లు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం చంద్రబాబు జీవితమంతా మోసం చేయడమేనని, పేదల సంక్షేమానికి తూట్లు పొడిచి సూపర్ సిక్స్ పథకాలను గంగలో కలిపేశాడని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ హామీలు అమలు సాధ్యం కావని నీతి అయోగ్ ప్రజెంటేషన్‌లో చంద్రబాబు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కరోనా వంటి ఆపత్కాలంలోనూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రశ్నిస్తానని పవన్ కల్యాణ్ ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.1.19లక్షల కోట్లు అప్పు తెచ్చిన చంద్రబాబు ఆ సొమ్ము ఏం చేశారో, ఎంత సంపద సృష్టించారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతా బాదుడేనని విద్యుత్ బిల్లులు, ఇసుక, మద్యం ఇలా అన్నింట్లోనూ ప్రజలపై భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేనని చెప్పిన చంద్రబాబు రాష్ట్రాన్ని పరిపాలించలేనని బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పి దిగిపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, రణస్థలం, జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, జిల్లా సెక్రటరీ ఆక్టివిటీస్ పేడాడ శ్రీరామమూర్తి, అంబటి రాంబాబు, ఎచ్చెర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గురాన తిరుమల మానస, బీసీసెల్, యువజన, విద్యార్థి విభాగం, ఎస్సీ విభాగం అధ్యక్షులు మజ్జి రమేష్, దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, నేతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గుజరాతిపేటలోని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి మాట్లాడుతూ గుజరాత్ హైకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, అదే తీర్పు ప్రకారం 7వ పే కమిషన్‌కు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రెగ్యులరైజేషన్ బకాయిలు చెల్లించాలని, 6 ఏళ్లలోపు పిల్లలందరికీ శిశుసంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు జరిపేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు టి.రాజేశ్వరి, డి.ముత్యాలమ్మ, డి.జ్యోతి, వై.లీలా, కె.పార్వతి, కె.ఆర్.భారతి తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు




గొర్లె కిరణ్‌ను సత్కరిస్తున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారు గురువారం మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను సత్కరించారు. దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం కిరణ్ ఎచ్చెర్ల నియోజకవర్గ మహిళా, బీసీ సెల్, యువజన, విద్యార్థి విభాగం, ఉపాధ్యాయ విభాగం, ఎస్సీ విభాగం అధ్యక్షులైన గురాన మానస, మజ్జి రమేష్, దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, బవిరి రమణ, నేతల కృష్ణలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 26 విభాగాల అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. పార్టీలో కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను దగా చేసిన చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం



శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఎన్నికల హామీలను అమలుచేయని చంద్రబాబును చూసి ప్రజలకు జగనన్న విశ్వసనీయత ఏంటో ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా అరచేతిలో వైకుంఠం చూపించి, కనికట్టు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చలేమని, పథకాలివ్వలేమని స్వాక్షాత్తు సచివాలయంలోనే ప్రకటించడం ప్రజలను దగా చేయడమేనని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులంటూ కూటమి ప్రభుత్వం రోజుకో అంకె చెబుతోందని, అలాగని చంద్రబాబు అప్పులు తీసుకురావడం లేదా అని ఆయన ప్రశ్నించారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు అంగ చంద్రశేఖర్‌రావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం తన కుమార్తెను చూసేందుకు కళాశాల లోపలికి వెళ్లి వచ్చే సరికి బైక్ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్‌లో 'ఒకేఒక్కడు'



బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావుతో హేమంత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక నేషనల్ గేమ్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన రత్నం హేమంత్‌కుమార్ ఎంపికయ్యాడు. డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 31 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. బాక్సింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారుడిగా 'ఒకే ఒక్కడు'గా హేమంత్ గుర్తింపు పొందాడు. హేమంత్ ఎంపిక పట్ల బాక్సింగ్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ అనంతలక్ష్మణ్‌దేవ్(అను), భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు బలగ సీతారాం, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, వంగ మహేష్, కోచ్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎంవీ రమణ, తదితరులు హర్షం వ్యక్తంచేశారు. హేమంత్ ఇప్పటికే డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ పి.ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జాతీయస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో ఐదు పతకాలు సాధించాడు.